తూర్పు గోదావరి

వార్త



శనివారం 29 డిసెంబరు, 2018 16 పేజీలు


# ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత పెంచేందుకు దృష్టిసారించాలి

## -జేఎన్‌టీయూకే దశాబ్ది వేడుకల్లో ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్







సీడీ విడుదల చేస్తున్న ఉదయభాస్కర్ తదితరులు, విజేతలకు బహుమతి ప్రదానం చేసిన రిజిస్ట్రార్, వీసీ తదితరుల

కాకినాడ సిటీ, డిసెంబర్ 28, ప్రభాతవార్త:

ఇంజనీరింగ్ విద్యలో నాణ్యతను పెంచేందుకు, నైపుణ్యాల శిక్షణపై గురిపెట్టాలని ఏపీపీఎస్సీ చైర్మన్ పి.ఉదయభాస్కర్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూ కాకినాడ ఆవిర్భవించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా వర్సిటీ అలుమ్ని ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన దశాబ్ది వేడుకకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వర్సిటీ ఉపకులపతి ఎం.రామలింగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉదయభాస్కర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని, పోటీపరీక్షలైన గ్రూప్‌వన్ తెలుగులో తప్పనిసరి చేశామన్నారు. వ్యవస్థలో మార్పు తీసుకు రాగలిగితే నాణ్యమైన విద్యనందించవచ్చన్నారు. తాను చదువుకుని ఉద్యోగం చేసిన యూనివర్సిటీ వేడుకలకు ముఖ్యఅతిథిగా రావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల్లో సుమారు 85శాతం మంది పరిశ్రమలకు అనుగుణంగా పనిచేసే నైపుణ్యం లేదన్నారు. పీజీ విద్యలో పరిశోధనలకు, అండర్

మిగతా 3లో

# ఇంజనీరింగ్ విద్యలో నాణ్యత పెంచేందుకు దృష్టిసారించాలి

(మొదటిపేజీ తరువాయి)

గ్రాడ్యుయేట్‌లో నైపుణ్యాభివృద్ధి పెంపొందేలా పాఠ్యప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులు అధ్యాపకులద్వారా కాకుండా అంతర్జాలం ద్వారా సందేహాలను నివృత్తి చేసుకుంటున్నారన్నారు. ఉపకులపతి ఎం.రామలింగరాజు మాట్లాడుతూ మొదటి ఉపకులపతి అల్లం అప్పారావు హయాంలో యూజీసీ నుంచి 12బి స్టేటస్ తీసుకురాగా, రెండో ఉపకులపతి జి.తులసీరాందాస్ హయాంలో జేఎన్‌టీయూ విజయనగరం ఏర్పాటు, జేఎన్‌టీయూకేలో మౌలిక సదుపాయాలు, భవన నిర్మాణాలపై దృష్టిసారించగా, మూడో వీసీ వీఎస్ఎస్ కుమార్ హయాంలో జేఎన్‌టీయూ నరసారావుపేట ఏర్పాటు, ఇంకుబేషన్, రీసెర్చి ఇన్నోవేషన్ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను అభివృద్ధి పరిచినట్టు తెలిపారు. రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు మాట్లాడుతూ జేఎన్‌టీయూకే విద్యార్థులెందరో ఉన్నతస్థానాల్లో ఉంటూ దేశఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా ఇనుమడింపచేశారన్నారు. పలు విదేశీ విశ్వవిద్యాలయాల్లో అనుసంధానమవుతూ నూతనకోర్సులు ప్రారంభం, ఆర్థిక లావాదేవీలు ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూకే విజయాలతోకూడిన సంచికను సీడీ రూపంలో ముఖ్యఅతిథి విడుదల చేశారు. అనంతరం ముఖ్యఅతిథి, మాజీ ఉపకులపతులను, విద్యావేత్తలను, రిటైర్డ్ ఉద్యోగులను శాలువా, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. మధ్యాహ్నం ప్లీనరీ సెషన్స్‌లో మాజీ ఉపకులపతులు, విద్యావేత్తలు, ఐఐటి, ఎన్ఐటి మాజీ ప్రొఫెసర్లు పాల్గొని విద్యావిధానాలపై సలహాలు, సూచనలందించారు. అనంతరం సాయంత్రం విద్యార్థులు ప్రదర్శించి సాంస్కృతిక ప్రదర్శనలు సభికులను అలరించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ శాంతిప్రభ, ఓఎస్డీ వి.రవీంద్రనాథ్, మాజీ ఉపకులపతులు అల్లం అప్పారావు, వీఎస్ఎస్ కుమార్, విద్యావేతలు, పారిశ్రామికవేతలు, పూర్వవిద్యార్థులు, అనుబంధ కళాశాల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు హాజరయ్యారు.